క్లుప్తంగా

తెలంగాణ సైకాలజిస్టు జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ : తెలంగాణ సైకాలజిస్టు జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పోకల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నల్లగొండ జిల్లా సైకాలజిస్టుల సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి రామచంద్ర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల, గంజాయి, డ్రగ్స్ వంటి బారిన పడకుండా అవగాహన కల్పించేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరుణశోభ, ఉపాధ్యక్షులుగా జె.రాజు, పి.వైష్ణవిదేవి, కోశాధికారిగా కె.రమేష్, సంయుక్త కార్యదర్శిగా జోగయ్య, మన్నెం సైదులు, కార్యవర్గ సభ్యులుగా సూర్యనారా యణ, మల్లేశంలు ఎంపికయ్యారు.

పారదర్శకత పాటించాలి

గుర్రంపోడు : రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తూ పారదర్శకతను పాటించాలని మండల ప్రత్యేక అధికారి వి. వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామ సభల్లో అర్హుల జాబితా ప్రదర్శిస్తూ ,కొత్త దరఖాస్తులను తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మంజుల, వ్యవసాయాధికారి మాధవరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతర ప్రశాంతంగా జరుపుకోవాలి

పెద్దవూర : రెండేళ్లకొకసారి నిర్వహించుకునే ముత్యాలమ్మ జాతరను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ఏర్పాట్లు చేయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ లింగారెడ్డి అన్నారు. మండలంలోని పొట్టివానితండా గ్రామ పంచాయతీ పరిధిలోని రామన్నగూడెం తండా వద్ద నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన కొలువై ఉన్న ముత్యాలమ్మ జాతరను ఫిబ్రవరి 11న జరుపుకునేందుకు రామన్నగూడెంతండా, ఏనేమీదితండా, పొట్టివానితండాలకు చెందిన పెద్దలు ఆయన సమక్షంలో సమావేశమై తీర్మానించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటినుంచే తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రమావత్ మోహన్‌నాయక్, బాసునాయక్, నాగేశ్వర్‌రావు, గోన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని వినతి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని 33వ వార్డులోని రాంనగర్ కాలనీలోని వెంకటేశ్వరా టాకీస్ వరద కాల్వ పక్కన ఏఆర్సీ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు మధ్యలో ఉందని, దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు ట్రాన్స్‌కో ఏడీఈకి సోమవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డు మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను కాలనీవాసులతో కలిసి ఆయన పరిశీలించారు.

సంక్షేమానికి దూరమైన రవీంద్రనగర్

- రేషన్‌షాపు, అంగన్‌వాడీ కేంద్రం లేక ఇబ్బందులు
- తాగునీరు, విద్యుద్దీపాలు లేక అవస్థలు
- కాలనీలో కులగణన చేయని వైనం


రవీంద్రనగర్ కాలనీ ప్రధాన రహదారి

మిర్యాలగూడ : పట్టణానికి శివారు ప్రాంతంలో ఉన్న రవీంద్రనగర్ సంక్షేమానికి నోచుకోవడం లేదు. 2015 మున్సిపల్ ఎన్నికల్లో గ్రామపంచాయతీగా ఉన్న రవీంద్రనగర్ మున్సిపాలిటీలో కలిసింది. అప్పటి నుంచి ఆ కాలనీ విస్తరిస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నార్కట్‌పల్లి– అద్దంకి బైపాస్‌రోడ్డుకు అవతల ఈ కాలనీ ఉండడంతో ఇక్కడి సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు అలసత్వం వహిస్తున్నారు. 2020లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో బత్తుల లక్ష్మారెడ్డి అత్యధిక మెజార్టీతో ఆ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 3 సంవత్సరాల పాటు కౌన్సిలర్‌గా కొనసాగిన ఆయన 2023లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించిన ఆ అవార్డులో కనీస సదుపాయాలు లేక కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కౌన్సిలర్ ఎమ్మెల్యే కావడంతో కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. రెండు సంవత్సరాలుగా ఈ వార్డుకు ప్రజాప్రతినిధి లేకపోవడంతో పట్టించుకునే వారే లేకపోయారు. దీంతో కాలనీ ప్రజలు ఆందోళన చేసేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా సోమవారం కాలనీలో నిరసన తెలిపారు.

సుమారు 200ఇళ్ల వరకు..

పట్టణం మొత్తం కుల గణన చేసినప్పటికీ రవీంద్రనగర్‌లో మాత్రం సగం వార్డుకు కూడా చేయలేదు. వార్డు నందిపాడులోని నంది నుంచి నార్కట్‌పల్లి–అద్దంకి హైవేను ఆనుకొని రైల్వేస్టేషన్‌కు వెళ్లేదారి ఎస్‌ఎస్సీ కాల్వ అవతల చిల్లాపురం రోడ్డు వరకు ఒక వార్డు ఉంది. సుమారు 900 నుంచి 1000 ఇండ్లు ఉన్నాయి. దీనికితోడు రోజురోజుకు అక్కడ ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. కాని కులగణనలో మాత్రం సగం కూడా చేయలేదు. తమకు అందుబాటులో ఉన్న ఇళ్లలో మాత్రమే కులగణన చేసి సుమారు 150నుంచి 200 ఇళ్లలో కులగణన చేయకుండా వదిలేశారు. కులగణన చేయాలని పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీనికి తోడు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల సర్వేకు కూడా నోచుకోలేదు.

మౌలిక వసతులకు దూరం

కాలనీలో 1500 నుంచి 2వేల వరకు ఓటర్లు ఉన్నారు. ఈ కాలనీ రోజురోజుకు విస్తరిస్తున్నప్పటికీ దానికి అవసరమైన రేషన్‌షాపు, అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో ఉన్న సుమారు 600 మంది కుటుంబాలు నందిపాడులో ఉన్న రేషన్ షాపుకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. దీని కోసం రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతినెలా ఇదే దుస్థితి నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలు లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు దూర ప్రాంతాల్లో ఉన్న కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంత దూరం వెళ్లలేక కొందరు కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోలేక ప్రభుత్వం అందించే సౌకర్యాలు పొందలేకపోతున్నారు.

డ్రెయినేజీలు లేక ఇబ్బందులు

రవీంద్రనగర్ కాలనీలో బైపాస్ రోడ్డు నుంచి చిల్లాపురంకు వెళ్లే రోడ్డు వరకు గత ప్రభుత్వంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆయా వీధుల్లో రోడ్లు లేక మట్టిరోడ్డుపైనే ప్రయాణం చేయాల్సి వస్తుంది. మట్టిరోడ్డు కూడా కంకర తేలి గుంతల మయంగా ఉండడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. అంతే కాకుండా రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి విష పురుగులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతుంది. దీని కారణంగా కాలనీ ప్రజల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

కులగణన చేయలేదు



నేను గత ఏడేళ్లుగా రవీంద్రనగర్‌లోనే నివాసం ఉంటున్నా.. ప్రభుత్వం మా కుటుంబానికి కులగణన చేయలేదు. ఎన్నిసార్లు అడిగినా అధికారుల నుంచి స్పందన లేదు. కనీసం ఇందిరమ్మ, రేషన్‌కార్డుల సర్వే కూడా చేయలేదు.

– వేణుధర్‌రెడ్డి, రవీంద్రనగర్

మౌలిక వసతులు కల్పించాలి



నేను గత 15 సంవత్సరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నా. మా కాలనీలో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లు, వీధిదీపాలు లేవు. మంచినీరు అందక కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి ఉంది. కులగణననే కాదు ఏ సర్వే కూడా మా ఇళ్లకు చేయలేదు.

ఆవుల జానకి, రవీంద్రనగర్

సర్వే చేశాం



రవీంద్రనగర్‌లో కులగణన చేశాం. ఆ వార్డులో 714 ఇళ్లకు సర్వే చేసి ఆన్‌లైన్ చేశాం. సమస్యలను తెలుసుకునేందుకు అనేక మార్లు ఆ వార్డుకు వెళ్తే కాలనీ ప్రజలు మాపై ఎగబడ్డారు. దీంతో మేము వెనక్కి తిరుగొచ్చాం. మౌలిక వసతులపై మా దృష్టికి రాలేదు.

ఎండీ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్

పథకాలు అర్హులకు అందేలా చూడాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి అందేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈనెల 25 వరకు గ్రామాల్లో పథకాల్లో అర్హులను గుర్తించేందుకు సర్వే చేపట్టి గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి పేదవాడు ప్రభుత్వ పతకాల్లో లబ్ధి పొందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమీషనర్ పాల్గొన్నారు.

దాడులు అరికట్టాలని ఉపాధ్యాయుల నిరసన


పెద్దదేవులపల్లి : జెడ్పీహెచ్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు


చింతపల్లి : పాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న టీయూటీఎఫ్ నాయకులు

త్రిపురారం : డిసెంబర్ 23న రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కంబాలపల్లి రాములుపై పాఠశాలలో విచక్షణారహితంగా చేసిన దాడిని ఖండిస్తూ సోమవారం మండలంలోని పెద్ద దేవులపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాణావత్ సైదులు, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యాయులు మధుసూదన్, రామారావు, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, ఇనాయతుల్లా, గోవర్ధన్ రెడ్డి, రాములు, జ్యోతి, మోతీలాల్, శారద, పాల్గొన్నారు.

యూటీఎఫ్ నిరసన

చింతపల్లి : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఘడియ గౌరారం పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుక్కుగూడ గెజిటెడ్ హెచ్‌ఎం కంబాలపల్లి రాములు పై అమానుషంగా దాడి నిర్వహించిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నల్గొండ జిల్లా కార్యదర్శి కాషిరెడ్డి కృష్ణారెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ బి.వెంకటేశం, సీనియర్ నాయకులు బి.కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే బాలునాయక్


సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి : దేవరకొండ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర్‌నగర్‌లో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ మండల కేంద్రం నుంచి గ్రామాలకు రోడ్డు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పిస్తానన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం ముందుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం మండల పరిధిలోని మదనాపురం లక్ష్మీనరసింహ స్వామి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్ష్మీ నరసింహ స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత మలివేల సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు ఆంగిరేకుల నాగభూషణం, హరి నాయక్, జంగిటి నరసింహ, మాస భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, యాదగిరి, నరసింహారెడ్డి, కొండల్ యాదవ్ పాల్గొన్నారు.

యంత్రాల సాయంతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

త్రిపురారం : రైతులు యంత్రాల సాయంతో పంటలు సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస రావు అన్నారు. సోమవారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌లో జిల్లాలోని రైతులకు మెట్ట వరి యంత్రంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ.. మెట్ట వరి పంట సాగు వల్ల నీటి ఆదా చేసుకోవడంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు. దుక్కిలో నేరుగా విత్తుకోవడం వల్ల భూసారం పదిలంగా ఉంటుందన్నారు. అనంతరం వరి పంటలో వచ్చే పలు రకాల చీడపీడలకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు నేటి నుంచి గ్రామ సభలు

మిర్యాలగూడ టౌన్ : ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా లబ్ధిదారులకు ఎంపికకు మంగళవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలను నిర్వహించనున్నట్లు మండల తహసీల్దార్ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మిర్యాలగూడ మండలంలో 21న ఐలాపురం, కుంటకింద తండా, అన్నారం, జప్తీవీరప్పగూడెం, ఆలగడప, జాలుబావితండా, బల్లునాయక్‌తండా, సీత్యాతండా, దొండవారిగూడెం, తడకమళ్ల, దీరావత్‌తండా, లావూడితండా, 22న కొత్తపేట, లక్ష్మీపురం, హట్యతండా, రాయినిపాలెం, బాధలాపురం, యాద్గార్‌పల్లి, కిష్టాపురం, కొత్తగూడెం, తక్కెళ్లపాడు, జంకుతండా, వెంకటాద్రిపాలెం, 23న భాగ్యగోపసముద్రంతండా, చిల్లాపురం, బోట్యానాయక్ తండా, గూడూరు. కాలువపల్లి, సామేగానితండా, జటావత్‌తండా, దుబ్బతండా, ఉట్లపల్లి, జేత్యాతండా, సుబ్బారెడ్డిగూడెం, 24న రుద్రారం, చింతపల్లి, టిక్యాతండా, అవంతిపురం, ముల్కలకాలువ, శ్రీనివాస్‌నగర్, తుంగపాడు, గోగువారిగూడెం, కుర్యాతండా, వాటర్ ట్యాంక్‌తండాలలో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మున్సిపాలిటీలో 21న 1వ వార్డు నుంచి 12వ వార్డుల వరకు, 22న 13వ వార్డు నుంచి 24వ వార్డుల వరకు , 23న 25వ తేది నుంచి 36వ వార్డుల వరకు , 24వ తేదిన 38 నుంచి 48 వార్డులకు వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హాలియా మండలంలో..

హాలియా : అనుముల మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న అన్నారం, ముక్కామల, తిమ్మాపురం, కొత్తపల్లి, పంగవానికుంట, పంగవానికుంట తండా, వీర్లగడ్డ తండా 22న పులిమామిడి, రామడుగు, శ్రీనాథపురం, పాలెం, చింతగూడెం, మారేపల్లి, యాచారం , 23న చల్మారెడ్డిగూడెం, కొట్టాల, నాయుడు పాలెం , కొరివేనిగూడెం, హజారిగూడెం, మాదారిగూడెం, పేరూర్ గ్రామల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

హాలియా మున్సిపాలిటీలో

21న 1వ వార్డులో ఉదయం 10.30 గంటలకు ప్రైమరీ స్కూల్(ఇబ్రహీంపేట), 5వ వార్డు అంగన్‌వాడీ స్కూల్, 9వ వార్డు ప్రైమరీ స్కూల్, 22న 2వ వార్డు అలీనగర్ ప్రైమరీ స్కూల్, 6వ వార్డు అంగన్‌వాడీ సెంటర్ (బొడ్రాయి దగ్గర), 10వ వార్డు ప్రైమరీ స్కూల్ (బొడ్రాయి దగ్గర), 23న 3వ వార్డు ప్రైమరీ స్కూల్ ఎస్సీ కాలనీ, 7వ వార్డు ప్రైమరీ స్కూల్ అనుముల, 11వ వార్డు హాలియా పబ్లిక్ స్కూల్, 24న 4వ వార్డు గణేష్ మండపం, 8వ వార్డు ప్రైమరీ స్కూల్ అనుముల, 12వ వార్డులో (న్యూకిడ్స్ స్కూల్) వార్డు సభలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

పెద్దవూర మండలంలో..

పెద్దవూర : మండలంలో ఈనెల 21 నుంచి 24వరకు లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుదీర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న కొత్తలూరు, జయరాంతండా, పొల్తీతండా, బసిరెడ్డిపల్లి, బట్టుగూడెం, శిరసనగండ్ల, పర్వేదుల, 22 నాయినివాని కుంటతండా, తుంగతూర్తి, వెల్మగూడెం, పెద్దగూడెం, గర్నెకుంట, లింగంపల్లి, పొట్టివానితండా, 23న తెప్పలమడుగు, కుంకుడుచెట్టుతండా, చింతపల్లి, పోతునూరు, పిన్నవూర, నీమానాయక్‌తండా, 24న పులిచర్ల, ఊట్లపల్లి, గేమ్యానాయక్‌తండా, పెద్దవూర, కోమటికుంటతండా, చలకుర్తి గ్రామ పంచాయతీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

త్రిపురారంలో..

త్రిపురారం : నిడమనూరు మండలంలోని 29 గ్రామ పంచాయతీలు, త్రిపురారం మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో నేటి నుంచి 24వ తేది వరకు ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు నిడమనూరు ఎంపీడీఓ వెంకటేశం, త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతి గ్రామానికి మండల స్థాయి అధికారిని నియమించామని, అధికారుల బృందం అయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంటారన్నారు.

నందికొండలో..

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన పౌరులకు కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సర్వేలో భాగంగా వార్డు సభలు నిర్వహిస్తున్నట్లుగా మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. హిల్‌కాలనీ మొదటి వార్డు వారికి అంగన్‌వాడీ కేంద్రంలో, ఐదో వార్డు వారికి సంఘమిత్ర స్టోర్‌లో మంగళవారం జరుగుతుందని తెలిపారు. పైలాన్ కాలనీలో 10 వార్డు వారికి అక్కడి సంఘమిత్ర స్టోర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలి

మిర్యాలగూడ : మండలంలోని అవంతీపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో లేకుండా తన విధులపై నిర్లక్ష్యం వహిస్తూ గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, విద్యుద్దీపాలు, పారిశుద్ధ్యాన్ని పట్టించుకోవడం లేదని, గ్రామపంచాయతీ జారీ చేసే సర్టిఫికెట్ల విషయంలో, ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా గ్రామపంచాయతీ రికార్డుల్లో ఎక్కించుకుంటున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే తమపై దుర్భాషలాడుతున్నారన్నారు. గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్ ట్రాలీ, ట్రాక్టర్‌ను ఇంతవరకు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ చేయించకుండా రెండేళ్లుగా గ్రామంలో పనులకు తిప్పుతున్నారన్నారు. అక్రమ లే అవుట్‌కు చెందినవారిపై చర్యలు తీసుకోకపోగా వాటికి సంబంధించిన ప్లాట్లకు అనుమతులు మంజూరు చేసి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని నష్టపరుస్తున్నారన్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వి.సురేష్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నేత్రదానం

కొండమల్లేపల్లి : పట్టణానికి చెందిన దుండిగళ్ల చంద్రకళ రెండు రోజుల క్రితం కడుపు నొప్పితో బాధపడుతూ హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించింది. కాగా మృతురాలి కోరిక మేరకు ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. తాను లేకున్న తన నేత్రాలతో మరొకరికి చూపునివ్వాలని ఆలోచించడంపై పలువురు ఆమె నేత్రదానాన్ని మెచ్చుకుంటూ మరికొంత మందికి స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొంటున్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

కొండమల్లేపల్లి : రుణమాఫీ, రైతు భరోసా ఎగొట్టి రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు నాయిని శ్రావణ్‌రెడ్డి, జబ్బు యాదయ్య, గుండెబోయిన లింగంయాదవ్, రమావత్ శ్రీనునాయక్, నేనావత్ శంకర్‌నాయక్, రాజమోని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

చింతపల్లి : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25నుంచి నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలోపార్టీ మండల కార్యదర్శి రాములు, పోలే వెంకటయ్య, అమృతాచారి, సర్దార్, సైదులు, ఎండీ జావేద్ ఉన్నారు.

సర్వేల పేరుతో కాలక్షేపం చేస్తున్న ప్రభుత్వం

మిర్యాలగూడ అర్బన్ : సంక్షేమ పథకాలు అందించకుండా సర్వేల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తుందని ఎం సీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోనే కుమారస్వామి అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు శేఖర్‌కు నివాళి

దేవరకొండ : ఏఐఎస్‌ఎఫ్ నాయకులు బొడ్డుపల్లి శేఖర్ వర్ధంతిని సోమవారం దేవరకొండ పట్టణంలో సా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన స్మారక స్థూపం వరకు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

గుర్రంపోడు : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) క్యాలెండర్‌ను సోమవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ నోముల యాదగిరి, తపస్ సంఘ జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పల్లపు సైదయ్య, పి. రామలింగమ్మ, శంకర్, సత్యనారాయణ, విజయశ్రీ, శంకర్, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదు

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్

త్రిపురారం : కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం ఆగదని సాగర్ మాజీ ఎమ్మెల్యే భగత్ యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ యాదవ్ మాట్లాడుతూ.. ఏదైనా ఎన్నికలు వచ్చే ముందే ప్రజా సంక్షేమ పథకాల పేరిట దరఖాస్తులు గుర్తుకు వస్తాయని, గ్రామాల్లోకి వచ్చే అధికారులను ప్రజలు నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, కామర్ల జానయ్య, పావనగుండ్ల వెంకటాచారి, అనుముల శ్రీనివాస్ రెడ్డి, గుండెబోయిన వెంకటేశ్వర్లు, భైరం కృష్ణ, జంగిలి శ్రీనివాస్, యాదయ్య, షేక్ దస్తగిరి, సయ్యద్, రాయనబోయిన వెంకన్న, నగిరి శ్రీనివాస్, ఆంజనేయులు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి పరామర్శ

మాజీ ఎంపీపీ కూరాకుల అంతయ్య యాదవ్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ సోమవారం హాలియా పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి మాజీ ఎంపీపీ అంతయ్య యాదవ్ ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జటావత్ రవినాయక్, నాయకులు శ్రీకర్‌నాయక్ ఉన్నారు.

43ఏళ్ల తరువాత అపూర్వ కలయిక


పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దేవరకొండ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1981–82 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో చదివిన విద్యార్థులు ఒక్కచోట చేరి తమ పాత మిత్రులతో కలిసి సరదాగా గడిపారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.55వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రెబెకా, పాత శాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సినీ స్వరాభిషేకం


నిర్వాహకులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు


పాటలు పాడుతున్న గాయకులు

మిర్యాలగూడ అర్బన్ : అలనాటి సినీ హీరోలు ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్, శోభన్‌బాబు లను స్మరించుకుంటూ శ్రీ వెంకటేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ స్వరాభిషేకం అందరిని అలరించింది. టీవీలలో వస్తున్న స్వరాభిషేకానికి ఏమాత్రం తీసిపోకుండా అలరించారు. ఇప్పటి వరకు ఏడు స్వరాభిషేకాలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం నిర్వాహకులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, రంగయ్యలు ఏలె సత్యనారాయణ, ఎం.సత్యనారాయణచారి, శ్రీనివాసచారి, మురళీధర్, సుదర్శన్, గాయని, గాయకులు రాం రంగారావు, ప్రతాప్, ఎల్లయ్య, నాగరాజు శ్రీనివాస్, దుర్గా, సౌజన్య, పద్మశ్రీ, సుజాత, శోభారాణి, రమణ, చందన, సరస్వతి, అండాలు, చింతామధు, రాజరత్నం పాల్గొన్నారు.

దేవాలయ భూములను పరిరక్షించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేవాలయ కమిటీ చైర్మన్

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామంలో నాలుగు దేవాలయాల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, సర్వే చేసి హద్దురాళ్లు పాతించాలని ఆ దేవాలయ కమిటీ చైర్మన్ ఐతగోని పరమేష్, కమిటీ సభ్యులు సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. సీతారామచంద్ర స్వామి దేవాలయానికి 26.17 ఎకరాలు, సదాశివాలయానికి 15 ఎకరాలు, అంజనేయస్వామి దేవాలయానికి 20 ఎకరాలు, అయోధ్య రామస్వామి దేవాలయానికి 21 ఎకరాలు ఉన్నాయని పేర్కొనారు. వీటిని గుర్తించి హద్దు రాళ్లు పాతించాలని కోరారు. ఈ భూములు కొంత మంది కబ్జా చేశారని, సర్వే జరిపించి కబ్జాల నుంచి విడిపించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలోజు నారాయణ, సతీష్ చారి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి

డిండి : అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదని సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ వెంకన్నకు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఏటి.కృష్ణ, మాజీ ఎంపీటీసీ ఏటి.రాధిక, నర్సింహ్మారావు ఉన్నారు.